మనం





నిజామాబాద్
కామారెడ్డి

శుక్రవారం । 12 । జూన్ । 2026 పేజీలు: 8

# జీపీడీపీ ప్రణాళికలు వేగవంతం చేయాలి

- ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ, వర్షాకాల సన్నద్ధతపై కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమీక్ష.
- గ్రామ అవసరాలు, ప్రజ ప్రాధాన్యతల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి.
- చేయూత పథకంలో జాప్యం లేకుండా అర్హులకు ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశం.



కామారెడ్డి, జూన్ 11 (మనం జిల్లా ప్రతినిధి):

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2026-27 రూపకల్పన, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పూరి గుడిసెల గుర్తింపు, ఉపాధి హామీ పథకం ద్వారా గృహ నిర్మాణ అంచనాలు, వనమహోత్సవం, ఎన్ఎఫ్బీఎస్, చేయూత పథకాల అమలు, వర్షాకాల సన్నద్ధత, ఘన వ్యర్థాల నిర్వహణ, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థ వినియోగం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

2




# పెండింగ్ కేసుల పరిష్కారానికి రాజీ మార్గాలను ప్రోత్సహించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. వరప్రసాద్.
- జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదుల సహకారం అవసరం.
- జూన్ 20న జాతీయ లోక్ అదాలత్పై కామారెడ్డిలో న్యాయవాదులతో అవగాహన.
- పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుంది.

2

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమష్టి కృషి అవసరం




- ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంనా డీఎల్ఎస్ఏ అవగాహన కార్యక్రమం.
- సాధన స్వచ్ఛంద సంస్థతో బాల సదన్ సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి టి. నాగరాణి.
- బాల కార్మికులను పనుల్లో చేర్చుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరిక.
- బాల కార్మికులు కనిపిస్తే డీఎల్ఎస్ఏ, చైల్డ్ హెల్ప్లైన్, 15100కు సమాచారం ఇవ్వాలి.

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, టి. నాగరాణి ఆధ్వర్యంలో సాధన స్వచ్ఛంద సంస్థ సహకారంతో కామారెడ్డి పట్టణంలోని హరిజనవాడలో ఉన్న బాల సదన్ చిల్డ్రన్ హోమ్ను సందర్శించి చిన్నారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

3

# జీపీడీపీ ప్రణాళికలు వేగవంతం చేయాలి

**- ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ, వర్షాకాల సన్నద్ధతపై కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమీక్ష.**
**- గ్రామా అవసరాలు, ప్రజ ప్రాధాన్యతల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి.**
**- చేయూత పథకంలో జాప్యం లేకుండా అర్హులకు ప్రయోజనాలు చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశం.**



కామారెడ్డి, జూన్ 11 (మనం జిల్లా ప్రతినిధి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2026-27 రూపకల్పన, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పూరి గుడిసెల గుర్తింపు, ఉపాధి హామీ పథకం ద్వారా గృహ నిర్మాణ అంచనాలు, వనమహోత్సవం, ఎన్ఎఫ్బీఎస్, చేయూత పథకాల అమలు, వర్షాకాల సన్నద్ధత, ఘన వ్యర్థాల నిర్వహణ, లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థ వినియోగం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పరిశుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

**జీపీడీపీ ప్రణాళికలు సమగ్రంగా రూపొందించాలి.**

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో గ్రామాల అవసరాలు, స్థానిక వనరులు, ప్రజల ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు సేకరించి తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, ఉపాధి, పచ్చదనం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధి లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్లకు పూరి గుడిసెల గుర్తింపు.**

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన నిరుపేదలకు గృహాలు మంజూరు చేసేందుకు గ్రామాల్లో ఉన్న పూరి గుడిసెలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభల ద్వారా అర్హులైన కుటుంబాలను గుర్తించి పారదర్శకంగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఉపాధి హామీ ద్వారా గృహ నిర్మాణ అంచనాలు.**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అవసరమైన అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో సాంకేతిక అనుమతులు, అంచనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ స్థాయిలో క్షేత్ర పరిశీలనలు నిర్వహించి నిర్మాణ అవసరాలకు అనుగుణంగా అంచనాలు రూపొందించాలని తెలిపారు.

**వనమహోత్సవ ఏర్పాట్లపై దృష్టి.**

జిల్లాలో నిర్వహించనున్న వనమహోత్సవ కార్యక్రమాల కోసం అవసరమైన అంచనాలను ముందస్తుగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొక్కల నాటడం, సంరక్షణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని సూచించారు.

**ఎన్ఎఫ్బీఎస్, చేయూత అమలు వేగవంతం.**

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బీఎస్) కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి ప్రయోజనాలు అందించాలని సూచించారు. చేయూత పథకం అమలులోనూ ఎలాంటి జాప్యం లేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకం ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**వర్షాకాల సన్నద్ధతకు ప్రాధాన్యం.**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా....**

గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇంటింటి నుంచి చెత్తను ప్రతిరోజూ సేకరించి డంపింగ్ యార్డులకు తరలించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల లక్ష్యంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

**లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వినియోగం.**

ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు లైవ్ ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వ్యవస్థ వినియోగంపై పూర్తి అవగాహనతో నిర్దేశిత మార్గదర్శకాల మేరకు అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (ఇన్చార్జి) ఎన్వీ గిరి, పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, డీపీఓ మురళి, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, జడ్పీ సీఈఓ చందర్, సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి రాజీ మార్గాలను ప్రోత్సహించాలి

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. వరప్రసాద్.**
**- జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయవాదుల సహకారం అవసరం.**
**- జూన్ 20న జాతీయ లోక్ అదాలత్పై కామారెడ్డిలో న్యాయవాదులతో అవగాహన.**
**- పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుంది.**





కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): జూన్ 20, 2026న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయడంలో న్యాయవాదులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ డా. సి.హెచ్.వి.ఆర్.ఆర్. వరప్రసాద్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డిలో జిల్లా న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డా. వరప్రసాద్ మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్ ప్రజలకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో, సౌహార్దపూర్వకంగా న్యాయం అందించే సమర్థవంతమైన వేదిక అని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న వివిధ కేసుల్లో రాజీకి అనుకూలమైన వాటిని గుర్తించి, సంబంధిత కక్షిదారులను లోక్ అదాలత్కు ప్రోత్సహించాలని న్యాయవాదులను కోరారు.

**చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

ప్రత్యేకంగా నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం-1881 కింద నమోదైన చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఇలాంటి కేసులను రాజీ ద్వారా పరిష్కరించడం వల్ల కోర్టులపై ఉన్న పెండింగ్ కేసుల భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, కుటుంబ వివాదాలు, మనీ సూట్లు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు తదితర సివిల్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు బార్ సభ్యులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగారాణి, సీనియర్ సివిల్ జడ్జి డా. సుమలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె. సుధాకర్, ప్రత్యేక మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ బి. దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల నారాయణ, ప్రధాన కార్యదర్శి బి. సురేందర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు వెంకటరాం రెడ్డి, అమృతరావు, శ్రీధర్, నందా రమేష్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి తమవంతు సహకారం అందిస్తామని, అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేస్తామని న్యాయవాదులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

- ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంనా డీఎల్ఎస్ఏ అవగాహన కార్యక్రమం.
- సాధన స్వచ్ఛంద సంస్థతో బాల సదన్ సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి టి. నాగరాణి.
- బాల కార్మికులను పనుల్లో చేర్చుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరిక.
- బాల కార్మికులు కనిపిస్తే డీఎల్ఎస్ఏ, చైల్డ్ హెల్ప్‌లైన్, 15100కు సమాచారం ఇవ్వాలి.




కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. నాగరాణి ఆధ్వర్యంలో సాధన స్వచ్ఛంద సంస్థ సహకారంతో కామారెడ్డి పట్టణంలోని హరిజనవాడలో ఉన్న బాల సదన్ చిల్డ్రన్ హోమ్ను సందర్శించి చిన్నారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్య యొక్క ప్రాముఖ్యత, బాలల సంక్షేమానికి సంబంధించిన చట్టపరమైన రక్షణలపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ చిన్నారుల బాల్యాన్ని, విద్యను, భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక దురాచారమని టి. నాగరాణి పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రక్షణ, గౌరవప్రదమైన జీవనం పొందే హక్కు ఉందని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల కార్మికులను పనుల్లో చేర్చుకోవడం చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల కార్మికులు గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు, చైల్ హెల్ప్లైన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా నల్సా హెల్ప్లైన్ 15100కు సమాచారం అందించాలని సూచించారు.

### బాల కార్మిక నిర్మూలన వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

అనంతరం చిన్నారులకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక నిర్మూలనపై రూపొందించిన అవగాహన వాల్ పోస్టర్లను టి. నాగరాణి ఆవిష్కరించారు. ప్రజల్లో చైతన్యం పెంపొందించడం, బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా సామాజిక బాధ్యతను పెంచడం లక్ష్యంగా ఈ పోస్టర్లను రూపొందించినట్లు తెలిపారు. తదనంతరం పోస్టర్లను వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించేందుకు సంబంధిత సిబ్బందికి అందజేశారు. కార్యక్రమం ముగింపులో బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గిరిజ, సీఎస్ఎం మమత, సంధ్యారాణి, విశ్వజ్యోతి, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగ సభ్యుడు రాజేందర్, బాల సదన్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడీలను బలోపేతం చేయండి

మోర్తాడ్, జూన్ 11 (మనం న్యూస్): చిన్నపిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించే అంగన్వాడీలను మరింత బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా అంగన్వాడి సంఘం అధ్యక్షులు దేవగంగు డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించడం పట్ల అంగన్వాడీ కేంద్రాలకు ఇబ్బందులు ఏర్పడతాయని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మోర్తాడ్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు మెమోరాండన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియక కార్యకర్తలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రతినెల 1వ తేదీని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలకు పీఎం శ్రీ పాఠశాలల్లో 4,131 కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వీటిని వెంటనే ఉపసంహరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కేంద్రాలను ఆయా గ్రామాలలో అంగన్వాడీ సెంటర్లకు అప్పగించాలని ఆమె కోరారు. దాదాపు 50 సంవత్సరాలుగా గ్రామాలలో 70 వేల మంది అంగన్వాడీ కార్యకర్తలు పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టం చేస్తూనే ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ భాగస్వాములు అవుతున్నారని, అయినప్పటికీ వారి సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసినప్పుడల్లా హామీలు ఇస్తున్న ప్రభుత్వం ఆత్రలో మాత్రం పెట్టడం లేదని దానివల్ల ఆర్థికంగానే కాకుండా ఇతరత్రా కూడా అంగన్వాడి కేంద్రాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15 వేల పోస్టులను భర్తీ చేయాలని, కార్యకర్తల వేతనాన్ని 18 వేలకు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. 2017 నుండి బకాయి పడ్డ టిఏ, డిఏ లను వెంటనే విడుదల చేయాలని, పదవి విరమణ పొందిన అంగన్వాడి సిబ్బందికి వెంటనే డబ్బులు చెల్లించాలని, కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూచనల మేరకు అంగన్వాడీ కార్యకర్తలకు బీపీఒ విధులను తప్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆన్లైన్ సమాచారాన్ని అందివ్వడానికి ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని అందువల్ల వాటి స్థానంలో 5జి నెట్వర్క్ ఉన్న ఫోన్లను కార్యకర్తలు అందరికీ అందజేయాలని కోరారు. అంగన్వాడి కేంద్రాలకు పక్క భవనాలు నిర్మించాలని, సమ్మె కాలంలో మరణించిన కార్యకర్తలకు రెండు లక్షల ఎక్స్గ్రేషన్ గా చెల్లించాలని, ప్రభుత్వ పథకాలు అన్నింటికీ అంగన్వాడీ కార్యకర్తలను అర్హులు చేయాలని దేవగంగు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.






# బస్వాపూర్లో విషాదం

**గుర్తు తెలియని వ్యాధితో 60 గొర్రెల మృతి.**

భిక్కనూరు, జూన్ 11 ( మనం న్యూస్ ): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కందూరు సాయిలు సుమారు 60 గొర్రెలు రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యాధి బారిన పడి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూసింది.

ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ బాధితుడు కందూరు సాయిలును చరవాణి ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ధి చంద్రకాంత్ రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. వెటర్నరీ వైద్యులు మరియు ఎమ్మార్వో పర్యవేక్షణలో మిగిలిన గొర్రెలకు తక్షణ వైద్య సేవలు అందిస్తూ, మరిన్ని నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుడుం పద్మస్వామి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనూరి సిద్ధిరాములు, ఎస్సీ సెల్ బిక్నూర్ మండల అధ్యక్షుడు తుడుం జీవన్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల బాబు లోకేష్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి, అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటా



**- క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి**

కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): ఇటీవల టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి జారీ చేసిన షోకాజ్ నోటీసు నేపథ్యంలో ఆయన గురువారం గాంధీభవన్లో క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ శ్యామోహన్ను కలిసి వివరణ సమర్పించారు. అనంతరం గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ., పార్టీ నిర్ణయాలు, అధిష్ఠానం ఆదేశాలకు తాను పూర్తిగా కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. షోకాజ్



నోటీసులో ప్రస్తావించిన వివిధ అంశాలకు సంబంధించిన తన సమాధానాలను కమిటీకి అందజేసినట్లు తెలిపారు. పార్టీ క్రమశిక్షణను గౌరవిస్తూ భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని ఆయన వెల్లడించారు.

## ప్రభుత్వ పాఠశాలల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నాగిరెడ్డిపేట, జూన్ 11 (మనం న్యూస్): మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గులపల్లి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు,



ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయరాజ్, గ్రామ కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు జ్యోతి, వార్డు సభ్యులు సాయిబాబా, లాలు, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# హిందూ స్మశాన వాటిక నిర్మాణానికి ఆమోదం

**- మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం.**

**- ఎస్.ఆర్. ఫౌండేషన్కు పనుల అప్పగింతకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం.**

**- కౌన్సిల్ ఆమోదంతో స్మశాన వాటిక నిర్మాణ పనులకు మార్గం సుగమం.**



కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. హిందూ స్మశాన వాటిక నిర్మాణ పనులను ఎస్.ఆర్. ఫౌండేషన్ ద్వారా చేపట్టేందుకు గురువారం నిర్వహించిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హిందూ స్మశాన వాటిక నిర్మాణానికి సంబంధించిన అజెండా అంశంపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. స్మశాన వాటిక నిర్మాణం ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, అంత్యక్రియల నిర్వహణకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా స్మశాన వాటిక నిర్మాణ పనులను ఎస్.ఆర్. ఫౌండేషన్కు అప్పగించే ప్రతిపాదనను కౌన్సిల్ ముందుంచగా, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో నిర్మాణ పనులకు అధికారికంగా ఆమోదం లభించింది.

**మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి**



కౌన్సిల్ నిర్ణయంతో హిందూ స్మశాన వాటిక నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని, పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సమావేశ వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాణం పూర్తయిన అనంతరం పట్టణ ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ గిరి, కౌన్సిలర్లు షేరు, అంజాద్, మహేష్, జావీద్, నిట్టు గంగాధర్, మోతీలాల్, వాజీద్, సుల్తానా అన్వార్, వనిత-రామ్మోహన్, కాళ్ల రాజమణి గణేష్, తహశీనున్నిసా లడ్డు, తాటి లావణ్య ప్రసాద్, లలిత-చిట్టిబాబు, అర్పిత, సావిత్రి-సత్యం, సుల్తానా బేగం యునుస్, సుల్తానా సిద్దిక్, అఖిల, కో-ఆప్షన్ సభ్యులు గొనె సునీత శ్రీనివాస్, అలీ బిన్ అబ్దుల్లా, అస్మా ముబాషీర్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లో వీఆర్కే, ఎస్ఆర్కే విద్యార్థుల సత్తా

**- రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన ఎస్. శ్రీవల్లి 496/500 మార్కులతో అగ్రస్థానం.**

**- 437/440 మార్కులతో జోబియా తన్వీర్కు రాష్ట్రస్థాయి గుర్తింపు.**

**- విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేసిన సీఈవో డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి.**

**- అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారమే విజయానికి కారణమని వ్యాఖ్య.**





కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): గురువారం విడుదలైన ఇంటర్మీడియట్ ఇంప్రూవ్మెంట్ పరీక్షల ఫలితాల్లో వీఆర్కే, ఎస్సార్కే జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మరోసారి తమ సత్తాను చాటారు. రాష్ట్రస్థాయిలో మెరుగైన మార్కులు సాధించి కళాశాలలకు కీర్తి తీసుకువచ్చారు. విద్యార్థిని ఎస్. శ్రీవల్లి 500 మార్కులకు గాను 496 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకు పొందగా, జోబియా తన్వీర్ 440 మార్కులకు గాను 437 మార్కులు సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచింది. పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం కళాశాలల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించిందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సీఈవో డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ., విద్యార్థులు సాధించిన ఫలితాలు కృషి, పట్టుదల మరియు అధ్యాపకుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయానికి సహకరించిన లెక్చరర్లు, తల్లిదండ్రులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలు భవిష్యత్తులోనూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ మరిన్ని విజయాలను సాధించేలా కృషి చేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ నవీన్ కుమార్, కో-ఆర్డినేటర్ దత్తాత్రి, ప్రిన్సిపల్ నరేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్లో చాలా సమస్యలు ఉన్నాయి



**- వాటిని పరిష్కరించాలి.**
**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్.**

నిజామాబాద్, జూన్ 11 (మనం బ్యూరో ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్లో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్లో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ., బుకింగ్ యాప్లో మండల స్థాయిని ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా రైతులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. స్థానిక సొసైటీలు, ఫర్టిలైజర్ షాపులను అందుబాటులోకి తీసుకువస్తే యాప్లో యూరియాను బుకింగ్ చేసుకోవడం సులభతరం అవుతుందన్నారు. మండల కేంద్రం లేదా యాప్లో సూచించిన పంపిణీ కేంద్రాలు అనేక గ్రామాలకు దూరంగా ఉన్నాయన్నారు. దీంతో బుక్ చేసుకున్న అనంతరం యూరియా బస్తాల కోసం రైతులు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతులపై అదనపు రవాణా చార్జీలు కూడా పడుతున్నాయని వ్యయప్రయాసలకు గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్య పరిష్కారానికి యాప్లో మండల యూనిట్కు బదులుగా రైతులకు అత్యంత చేరువలో ఉండే ప్యాక్స్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాలను చేర్చాలని ఆయన కోరారు.

ప్రస్తుత సీజన్కు సంబంధించి జిల్లాలో రైతులు ఇప్పటికే వరినట్లు వేసే పనుల్లో నిమగ్నమై ఉన్నారని దినేష్ తెలియజేశారు. కానీ ఇప్పటివరకు ఒక ఎకరానికి ఎన్ని బస్తాల యూరియా కేటాయిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. దీంతో రైతాంగంలో తీవ్ర అయోమయానికి రైతాంగం అయోమయానికి గురవుతుందని ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇస్తే రైతులు దానికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకుంటారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం యూరియా కేటాయింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ సభ్యత్వ సన్నాహ సమావేశం

రుద్రూర్, జూన్ 11 (మనం న్యూస్): బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాజీ రెడ్డి గివర్ధన్ మాట్లాడుతూ., రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆగన్న, హన్మంత్ షిండే, ఎమ్మెల్సీ విజీ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ గాండ్ల మధు, నాయకులు దౌర్ సాయిలు, బొట్టే గజేందర్, కొత్తపల్లి రవి కిరణ్, శేఖర్, పార్వతి ప్రవీణ్, కన్నె ప్రవీణ్, శివ, కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## హెచ్పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**- ఇద్దరికి తీవ్ర గాయాలు.. జిల్లా ఆసుపత్రికి తరలింపు**

నిజామాబాద్ రూరల్, జూన్ 11 (మనం న్యూస్): సిరికొండ మండల కేంద్రంలోని హెచ్పీ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వెళ్తున్న మోటార్సైకిల్ ఎదురుగా వస్తు టర్న్ అవుతున్న పెట్రోల్ ట్యాంకర్ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం., తూంపల్లి గ్రామానికి చెందిన అయినాల అశోక్ (55), ఏనుగంటి సాయిలు (40) ఇద్దరూ టీఎస్ 16 ఈఎన్ 3245 నంబర్ గల మోటార్సైక్ పై ప్రయాణిస్తుండగా, ఎదురుగా వస్తున్న టీఎస్ 16 యూబీ 0943 నంబర్ గల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ ట్యాంకర్ను బలంగా ఢీకొట్టారు. ఢీకొన్న ప్రభావానికి బైక్ ట్యాంకర్ కింది భాగంలోకి వెళ్లిపోగా, ఇద్దరు రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో అధిక రక్తస్రావం జరిగినట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జె రామకృష్ణ తెలిపారు.





## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట్, జూన్ 11 (మనం న్యూస్): మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన చింతలపల్లి రాజుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ., స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చొరవతో చింతలపల్లి రాజుకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.18,500 ఆర్థిక సహాయం మంజూరైందని తెలిపారు. ఆపద సమయంలో ప్రభుత్వ సహాయం పేద ప్రజలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నార్ల గంగమణి మల్లేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగుల మోహన్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భూమా శ్రీరామ్ గౌడ్, గ్రామ ఉపాధ్యక్షుడు గోవిందు బలరాం రెడ్డి, కోఆర్డినేటర్ కమిటీ సభ్యుడు ఫిరంగి బాలయ్య, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పసులాది క్రిష్టఫర్, నాయకులు రవీందర్, చాకలి గంగయ్య, మణిగిరి లక్ష్మణ్ కొండ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐ గంగాధర్కు ఘన సన్మానం

**- అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్ ఆధ్వర్యంలో సత్కారం.**



రెంజల్, జూన్ 11 (మనం న్యూస్): రెంజల్ మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గంగాధర్ను అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్ మాట్లాడుతూ., ప్రజల భద్రతకు పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ గంగాధర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్ఐ గంగాధర్ మాట్లాడుతూ., పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువగా ఉండేలా పనిచేస్తామని, ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్తో పాటు జాదవ్ రాము, భగవాన్ సొంకాంబ్లె, సచిన్ గంగావోని తదితరులు పాల్గొని ఎస్ఐ గంగాధర్ను మర్యాదపూర్వకంగా సన్మానించారు.





# ఆటో, స్కూటీ ఢీ ఒకరు మృతి

కమ్మర్ పల్లి జూన్ 11 (మనం న్యూస్): కమ్మర్ పల్లి మండలం కొనసముాందర్ గ్రామంలో గురువారం ఆటోకు స్కూటీకి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న 18 సంవత్సరాల యువకుడు లాడే చరణ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి లాడే అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవ్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కమ్మర్పల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు.

# యాప్లతో యూరియా బుకింగ్ రైతులకు భారంగా మారింది.

**- చదువు రాని రైతుల ఇబ్బందులు గుర్తించి పాత విధానంలోనే ఎరువులు అందించాలి.**

**- రైతు గాండ్ల రాజన్న.**



నిజామాబాద్ రూరల్, జూన్ 11 (మనం న్యూస్): యూరియా పంపిణీ కోసం యాప్ ఆధారిత విధానాన్ని అమలు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిరికొండ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రైతు గాండ్ల రాజన్న ఆవేదన వ్యక్తం చేశారు. చదువు లేని లేదా స్మార్ట్ఫోన్ వినియోగంపై అవగాహన లేని రైతులకు ఈ విధానం ఇబ్బందికరంగా మారిందన్నారు.

గ్రామాల్లో చాలా మంది రైతులకు మొబైల్ ఫోన్ ఉన్నప్పటికీ యాప్లను ఉపయోగించే పరిజ్ఞానం లేదని, యూరియా బుకింగ్ ఎలా చేయాలో తెలియక ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇతరుల సహాయం తీసుకుని బుకింగ్ చేయించే ప్రయత్నం చేసినా, అప్పటికే యాప్లో అందుబాటులో ఉన్న స్టాక్ పూర్తవడం లేదా బుకింగ్ అవకాశం కనిపించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు.

ప్రభుత్వం రైతుల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, యాప్ ఆధారిత విధానంతో పాటు గతంలో అమలు చేసిన విధంగా నేరుగా ఎరువుల పంపిణీ వ్యవస్థను కూడా కొనసాగించాలని కోరారు. ముఖ్యంగా చదువు రాని, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ పనుల సమయంలో రైతులు సాంకేతిక సమస్యలతో కాకుండా సాగుపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# అభివృద్ధిపై ప్రత్యేక మున్సిపల్ సమావేశం నిర్వహించాలి.. బీజేపీ కౌన్సిలర్లు

**- అభివృద్ధి పనులు ప్రారంభించే ముందు డీపీఆర్ను కౌన్సిల్ ముందుంచాలని సూచన.**

**- నూతన పాలకవర్గం ఏర్పాటైన తర్వాత అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చ జరగలేదని వ్యాఖ్య.**

**- మున్సిపల్ సమావేశాలు పాత బిల్లుల చెల్లింపులకే పరిమితమవుతున్నాయని విమర్శ.**

**- కౌన్సిలర్ల నుంచి సమస్యలు సేకరించి సమగ్ర ఎజెండా రూపొందించాలని డిమాండ్.**



కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): పట్టణ అభివృద్ధి, వార్డుల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను పూర్తి స్థాయి ఎజెండాలో చేర్చి వారం రోజుల్లోగా ప్రత్యేక మున్సిపల్ సమావేశం నిర్వహించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గురువారం జరిగిన మున్సిపల్ సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డు స్మశానవాటిక అభివృద్ధి పనులను ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలనే ఏకైక ఎజెండాకు బీజేపీ పూర్తి మద్దతు తెలిపిందన్నారు. అయితే అభివృద్ధి పనులు ప్రారంభించే ముందు సంబంధిత డీపీఆర్ను మున్సిపల్ కౌన్సిల్ ముందుంచాలని కోరినట్లు తెలిపారు. నూతన మున్సిపల్ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి పట్టణ అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చ జరగలేదని, సమావేశాలు ప్రధానంగా పాత బిల్లుల చెల్లింపులకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. మొత్తం 49 వార్డుల కౌన్సిలర్ల నుంచి సమస్యలను సేకరించి, వాటి ఆధారంగా సమగ్ర ఎజెండా రూపొందించి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, కేవలం బిల్లుల చెల్లింపుల కోసం సమావేశాలు నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు.

# రాజీతో కేసులను పరిష్కరించుకోండి

**- ఈనెల 20న జాతీయ మెగా లోక్ అదాలత్**

**- సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి**

ఆర్మూర్, జూన్ 11 (మనం న్యూస్): ఆర్మూర్ ఈనెల 20న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా ఆర్మూర్ మండల్ లీగల్ సర్వీస్ చైర్ పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీదేవి అధ్యక్షతన కోఆర్డినేషన్ మీటింగ్ గురువారం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ ఉన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి మాట్లాడుతు., లోక్ అదాలత్ లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ నిర్వహణకు సంబంధించిన కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు తదితర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా కల్పించబడుతుందని తెలిపారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా రాజీ కుదిరేలా అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుదురుపాక ప్రవీణ్ చందర్, ఆర్మూర్ పట్టణ సీఐ సత్యనారాయణ గౌడ్, రూరల్ సీఐ జాన్ రెడ్డి, భీమ్గల్ సీఐ సత్యనారాయణ, అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్ఐ లు, కోర్ట్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# మండల కేంద్రంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం

**- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీతో లబ్ధిదారులకు భరోసా.**

**- నిజాంసాగర్లో డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా పంపిణీ**

నిజాంసాగర్, జూన్ 11( మనం న్యూస్): నిజాంసాగర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ., ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలుస్తోందని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం అప్పుల పాలవకుండా సిఎంఆర్ఎఫ్ పథకం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం వారి వెంటే ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నారై భుజంగారి భాస్కర్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమం



**- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలి.**

నిజామాబాద్ రూరల్, జూన్ 11 (మనం న్యూస్): ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్-1, యూనిట్-3 ఆధ్వర్యంలో డిచ్పల్లి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. సి.హెచ్. శ్రీనివాస్, డా. ఎన్. స్వామిరావుతో పాటు పర్యావరణ సమన్వయకర్తలు గ్రామస్తులు, మహిళలు, కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో రూపొందించిన అవగాహన పోస్టర్ల ద్వారా ఒక్కసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ, ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఘన వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, దానికి బదులుగా బట్ట సంచులు, జూట్ సంచులను ఉపయోగించాలని సూచించారు. పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె. గంగాధర్, ఎస్జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ. గోవర్ధన్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ ఇంజనీర్ మానస తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రజలు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## డిప్యూటీ ఈవో పోస్టులకు బీఈడీ, ఎంఈడీ అభ్యర్థులకే అవకాశం కల్పించాలి

**- టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలు.**

**- పాఠశాల విద్యకు సంబంధించిన పోస్టులకు బీఈడీ, ఎంఈడీ అభ్యర్థులకే అవకాశం ఇవ్వాలి.**

**- ఉపాధ్యాయ శిక్షణ అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యం కల్పిస్తే విద్యా రంగానికి మేలు.**

**- ప్రస్తుత విద్యా వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా అర్హతలను పునఃపరిశీలించాలి.**



కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇటీవల విడుదల చేసిన డిప్యూటీ ఈవో పోస్టుల నియామక నోటిఫికేషన్లో విద్యార్హతలను పునఃపరిశీలించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలు ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల విద్యకు సంబంధించిన ఈ పోస్టులకు కేవలం పీజీ అర్హతను నిర్దేశించడం సరైన నిర్ణయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈవో పోస్టుల విధులు విద్యా వ్యవస్థతో ముడిపడి ఉన్నందున బీఈడీ, ఎంఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు కూడా అవకాశం కల్పిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు ఉన్నత విద్యతో పాటు ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు పూర్తి చేసినప్పటికీ వారికి అవకాశం లేకుండా పోతోందని అన్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం అమల్లో ఉన్న నియామక విధానాలనే ప్రస్తుతం యథాతథంగా కొనసాగించడం భవిష్యత్ విద్యావ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఉండదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నోటిఫికేషన్లో తగిన మార్పులు చేసి బీఈడీ, ఎంఈడీ అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశం కల్పించాలని డాక్టర్ బాలు విజ్ఞప్తి చేశారు.



## ఆన్‌లైన్ బెట్టింగ్, అప్పుల భారంతో వ్యక్తి ఆత్మహత్య?

**- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ నరహరి.**

కామారెడ్డి, జూన్ 11: కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్డులో చర్చి వెనుక ఉన్న పొదల్లో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడు ఎమ్మార్ కాలనీకి చెందిన అంకం క్రాంతి కుమార్ (40)గా గుర్తించారు. పట్టణ సీఐ నరహరి అందించిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు క్రాంతి కుమార్ కొంతకాలంగా ఆన్లైన్ బెట్టింగ్లో పాల్గొని భారీగా డబ్బు నష్టపోయినట్లు తెలిసింది. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారంతో మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, విచారణ అనంతరం ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలు వెల్లడికానున్నాయని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో ఎమ్మార్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కొత్తపల్లిలో నూతన బోరు మోటార్ ఏర్పాటు



ఎల్లారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధి ఐదవ వార్డులోని కొత్తపల్లిలో తాగునీటి సమస్య ఉందని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ దృష్టికి కౌన్సిలర్ చంద్రయ్య తీసుకెళ్లగానే బోర్ మోటార్ను వెంటనే బిగించామని తెలిపారు. దాంతో వార్డ్ కౌన్సిలర్ చంద్రయ్య ఐదవ వార్డుకు సంబంధించిన ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ., ఎక్కడైనా తాగునీటికి ఇబ్బంది అనిపిస్తే వెంటనే తెలియజేస్తే నూతన బోరు మోటర్ ను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు తాగునీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా చూడాలని, ఇప్పటికే అన్ని రకాలుగా వార్డులోని సమస్యలను పర్యవేక్షి సమస్యలను వెంటనే తీర్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు ఏ చిన్న సమస్య ఉన్న వెంటనే పరిష్కరించాలని అధికారులకు పురమాయించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్ గఫర్, గాదె తిరుపతి,శంకర్ తోపాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## భార్య, ముగ్గురు పిల్లలు అదృశ్యం.. కేసు నమోదు

**- షాపింగ్ అని వెళ్లి తల్లితోపాటు ముగ్గురు పిల్లల అదృశ్యం.**

**- ఇంటికి చేరుకుంటామని చెప్పి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యుల ఆందోళన.**





కామారెడ్డి, జూన్ 11 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణానికి చెందిన యాడారం భాను ప్రకాష్ ఫిర్యాదు మేరకు ఆయన భార్య లయ అలియాస్ శ్యామల (31), కుమార్తె బిందు (17), కుమారుడు శివ (13), మరో కుమార్తె దీవీజా (8) అదృశ్యమైన ఘటనపై కామారెడ్డి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, ఫిర్యాదు ప్రకారం, బుధవారం కుటుంబ సభ్యులు షాపింగ్ నిమిత్తం కామారెడ్డికి వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బావమరిది ఇంటికి వెళ్లి భోజనం చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్నామని చెప్పి ఆటోలో బయలుదేరారు. రాత్రి 8 గంటల వరకు బస్సులో ఇంటికి చేరుకుంటామని తెలిపినప్పటికీ ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులను ఆశ్రయించారు. భార్యతో పాటు ముగ్గురు పిల్లలు కనిపించకపోవడంతో భాను ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# కలెక్టరేట్లో ఎస్ ఐ ఆర్ - 2026 హెల్ప్ డెస్క్

**- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**
**- భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం.**
**- కలెక్టరేట్ 25వ గదిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు.**
**- ఎస్ ఐ ఆర్ టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా ఓటర్లు సేవలను వినియోగించుకోవాలి.**
**- అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో వివరాలు పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచన.**




కామారెడ్డి, జూన్ 11 (మనం జిల్లా ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఎస్ ఐ ఆర్-2026 హెల్ప్ డెస్కును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం ప్రారంభించారు. అదనపు కలెక్టర్ విక్టర్ ఆయనతో కలిసి హెల్ప్ డెస్కును ప్రారంభించారు. కలెక్టరేట్లోని 25వ గదిలో ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ఓటరు జాబితాకు సంబంధించిన సేవలను ప్రజలకు సులభంగా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, వివరాల మార్పులు, పేర్ల తొలగింపు, చిరునామా మార్పు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, సందేహాలకు సమాధానాలు అందించడం కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్-2026 ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ప్రజలు టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1950ను సంప్రదించవచ్చని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరారు. ఎన్నికల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ఓటరు జాబితాను తప్పులులేని విధంగా రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి (ఏఓ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# చిన్నారుల భవిష్యత్తుకు పునాది

**- నూతన అంగన్వాడీ భవనానికి భూమిపూజ.**
**- నీలా గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ క్యాతం యోగేష్.**

రెంజల్, జూన్ 11 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని నీలా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించనున్న నూతన అంగన్వాడీ భవనానికి గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్ బుధవారం భూమిపూజ నిర్వహించారు. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ఈ భవనం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ క్యాతం యోగేష్ మాట్లాడుతూ., గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్న ఆయన, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ క్యాతం యోగేష్తో పాటు వార్డు సభ్యులు, సద్దాం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం...?

**- 85 ఏండ్ల వృద్ధుడు మైనర్ బాలికపై అత్యాచారం..?**
**- ఆలస్యంగా వెలుగులోకి ఘటన..**
**- అత్యాచారానికి ఏడు లక్షల ఖరీదా..?**



ఆర్మూర్, జూన్ 11 (మనం న్యూస్): ఆర్మూర్ పట్టణంలోని ఓ కాలనీలో మైనర్ బాలికపై అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగులకు వచ్చింది. 85 ఏళ్ల వృద్ధుడు మైనర్ బాలికపై అత్యాచారం స్థానికంగా సంచలనం రేపింది. పట్టణంలో ఓ కాలనీలో జరిగిన ఈ ఘటన నెల రోజులుగా గొప్యంగా ఉండి పుకార్లు రేకెత్తిస్తుంది. ఓ మైనర్ బాలికపై 85 ఏళ్ల కురువృద్ధుడు అత్యాచారం జరిపినప్పటికీ ఇట్టి విషయం బయటకు రాకపోవడం కాలనీ వాసుల్లో చర్చాంశనీయంగా మారింది. చివరికి వృద్ధుడు కాలనీలో కనబడకపోవడంతో కాలనీవాసులందరూ విస్తు పోయారు. ఈ విషయాలసారమై పోలీసులు దృష్టి సారించారా లేదా అన్నది ఇంకా తెలియ రాలేదు. అసలు నిందితుడు పట్టుబడ్డడా లేదా అనే విషయంపై కాలనీవాసుల్లో చర్చ మొదలైంది. మరి పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించాలని ఆర్మూర్ పట్టణ ప్రజలు కోరుతున్నారు. మైనర్ బాలికపై అత్యాచారం అనే ఘటన విషయమై చిన్నపిల్లలు సైతం కాలనీలో గుసగుసలాడుతున్నారు. ఈ విషయమై పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపాలంటే జంకుతున్నారు. మరి ఇలాంటి ఘటనలపై పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం., పరిచయం ఉన్న వ్యక్తి మాయమాటలు చెప్పి బాలికను వేధిస్తూ అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితురాలు భయంతో ఈ విషయాన్ని కొంతకాలం పాటు ఇంట్లో చెప్పకపోవడంతో ఘటన ఆలస్యంగా బయటపడింది. ఇటీవల బాలిక అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా విషయం తెలిసినట్లు సమాచారం. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించి కౌన్సెలింగ్ అందిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపగా, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఏక్ పెడ్ మా కే నామ్ - సోవింగ్ టు గ్రోయింగ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

**- పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలి.**
**- వీసీ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు**




నిజామాబాద్ రూరల్, జూన్ 11 (మనం న్యూస్): తెలంగాణ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏక్ పెడ్ మాకే నామ్ - సోవింగ్ టు గోయింగ్ 2026 పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టి. యాదగిరి రావు గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెరిగి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ అపర్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఎన్. స్వామి, డా. చి. శ్రీనివాస్ పాల్గొన్నారు. సోవింగ్ టు గ్రోయింగ్-2026 కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె. గంగాకిషన్, ఎన్జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ. గోవర్ధన్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ ఇంజనీర్ మనసా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.